సాక్షి విజయనగరం

సోమవారం ı 23 ı జూన్ ı 2025



ఎన్నాళ్లీ ఇబ్బందులు..!
వారంతా గిరిజనులు.. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు.. వారి జీవితాల వలే పిల్లల జీవితాలు కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. - 8లో



ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాల్సిందే..!
గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయాన్ని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాలని బుచ్చి అప్పారావు జలాశయం ఆయకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. - 8లో



క్రీడాకారులకు ప్రోత్సాహం..
కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. ప్రభావతి అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు

విజయనగరం టౌన్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని పూరీ జగన్నాథ్ స్వామి రథయాత్రకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 08313 విశాఖ – పూరీ స్పెషల్ (26న అర్ధరాత్రి దాటాక) ఈ నెల 27 నుంచి జూలై 5 వరకూ, తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 08314 పూరీ – విశాఖ స్పెషల్ ఈ నెల 28 నుంచి జూలై 6 వరకూ నడుస్తుంది. జగదల్‌పూర్ – పూరీ – జగదల్ పూర్ స్పెషల్ ట్రైన్ నెంబర్ 08445 ఈ నెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకూ, తిరుగు ప్రయాణంలో 08446 ఈ నెల 28 నుంచి జూలై 6వరకూ నడుస్తుంది. అదేవిధంగా రాయగడ – కుర్దారోడ్డు – రాయగడ స్పెషల్ ట్రైన్ నెంబర్ 08593 ఈ నెల 26 నుంచి జూలై 7వరకూ తిరుగు ప్రయాణంలో 08594 కుర్దారోడ్డు – రాయగడ స్పెషల్ ఈ నెల 28 నుంచి జూలై 6 వరకూ నడుస్తాయి. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ



హైకోర్టు జడ్జి చీమలపాటి రవిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైమ్ : రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, విజయనగరం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి చీమలపాటి రవిని ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా కోర్టులో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులో జరగనున్న న్యాయ సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు హైకోర్టు జడ్జి రవి విజయనగరం వచ్చారు. ఈ క్రమంలో ఆయనను ఎస్పీ కలిసి పూల మొక్కను అందజేశారు.

జాబ్ మేళాలో 162 మంది ఎంపిక

నెల్లిమర్ల: పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాలో జిల్లాకు చెందిన 437 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు. హెటెరో, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ తదితర 13 కంపెనీలకు చెందిన ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 162 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ మేళాను పర్యవేక్షించారు. ప్లేస్మెంట్ అధికారి భాస్కర్, కోఆర్డినేటర్ నీతూ పాల్గొన్నారు.

జూలై 26, 27 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి రూరల్: సీపీఐ 14వ జిల్లా మహాసభలు జూలై 26, 27 తేదీల్లో బొబ్బిలి పట్టణంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ వెల్లడించారు. మండలంలోని సీహెచ్ బొడ్డవలస గ్రామంలో సీపీఐ మండల సభను ఆదివారం నిర్వహించారు. మండల కార్యదర్శిగా కాగాన గణేష్‌ను ఎంపిక చేశారు. అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలక పక్షాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహిస్తూ రైతు, పేద, బడుగు వర్గాల్లో వెలుగులు నింపేందుకు సీపీఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నిరుపేద, గిరిజనులకు భూ హక్కుల ను కల్పించడమే తమ పోరాటాల లక్ష్యమన్నా రు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ ను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా స భ్యులు కోట అప్పన్న, కార్యదర్శి కాగాన గణేష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

చాప కింద నీరులా..!





- పెరుగుతున్న కరోనా కేసులు
- అధికారిక లెక్కల ప్రకారం 17 కేసుల నమోదు
- నెలిమర్ల, జామి, గంట్యాడ, దత్తిరాజేరు, విజయనగరం మండలాల్లో నమోదు
- ఆసుపత్రిల్లో కొందరు, హోమ్ ఐసోలేషన్‌లో కొందరు..
- కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

విజయనగరం ఫోర్ట్:

కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతుంది. చాప కింద నీరులా వ్యాధి విజృంభిస్తుంది. కరోనా వ్యాప్తి ప్రమాదకరమని తెలిసినప్పటికీ ఇంకా చాలా మందిలో అప్రమత్తత లేదు. ఫలితంగా వ్యాధి బారిన పడుతున్నారు. కోవిడ్ జాగ్రత్తలు చాలా మంది పాటించడం లేదు. గతంలో కోవిడ్ మహమ్మారి బారిన ఎంతో మంది మృత్యువాత పడ్డారు. ఆసుపత్రుల్లో రోజుల తరబడి చికిత్స తీసుకుని ఎందరో ప్రాణాలతో బయటపడ్డారు. నాలుగేళ్ల కిందట కోవిడ్ పేరు చెబితే జనాలు హడలిపోయేవారు. అంతలా కరోనా యావత్ ప్రపంచాన్ని వణికించింది.

కోవిడ్‌ను సమర్థవంతంగా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్ల పాటు కోవిడ్ వ్యాప్తి కలవరం కలిగించింది. జనం ఇళ్లకే పరిమితం అయ్యారు. వీలైనంత ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహించి కోవిడ్ వ్యాప్తిని తగ్గించింది. అంతేకాకుండా క్వారంటైన్ సెంటర్స్ ఏర్పాటు చేసి అక్కడ చికిత్సతో పాటు పౌష్టికాహారం అందజేశారు. ఆసుపత్రుల్లో వేలాది బెడ్స్ ఏర్పాటు చేసి ఇన్‌పేషంట్ సేవలు అవసరమైన వారికి చికిత్స అందించారు. కరోనా సోకిన వారికి ఆక్సిజన్ లెవల్స్ తగ్గిపోవడంతో ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి నిరంతరం ఆక్సిజన్ అందించారు. ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ కూడా అధిక సంఖ్యలో ఏర్పాటు చేశారు. అన్నిటి కంటే ముఖ్యంగా ఏ రోజు ఎంతమందికి పరీక్షలు చేశాం.. ఎంతమందికి పాజిటివ్ వచ్చింది, ఎంత మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశాం అనే సమాచారాన్ని ప్రతీ రోజు మీడియాకు అందించేవారు.

ఇప్పుడు విరుద్ధమైన పరిస్థితి

కూటమి ప్రభుత్వ హయాంలో విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. ఎంతమందికి పరీక్షలు చేశామనిగాని, ఎంతమందికి పాజిటివ్ వచ్చిందనిగాని, ఏ ప్రాంతాల్లో కోవిడ్ వ్యాప్తి ఉందనిగాని సమాచారం ఇవ్వడం లేదు. ఎన్ని కేసులు వచ్చాయన్న సమాచారం కూడా పదేపదే అడిగితేగాని ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోవిడ్ సమాచారాన్ని ప్రచురిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండడానికి అవకాశం ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో 17 కేసుల నమోదు

జిల్లాలో ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. నెల్లిమర్ల, జామి, గంట్యాడ, బొబ్బిలి, మెంటాడ, దత్తిరాజేరు, విజయనగరం మండలాల్లో కేసులు నమోదయ్యాయి.



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కోవిడ్ టెస్టు కోసం పీపీ కిట్టు ధరించిన ల్యాబ్ టెక్నీషియన్



రాపిడ్ టెస్ట్ చేస్తున్న టెక్నీషియన్

పరీక్షలు చేస్తున్నాం...

కోవిడ్ పరీక్షలను పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, సర్వజన ఆసుపత్రిలో చేస్తున్నారు. కోవిడ్ బారిన పడకుండా ప్రజా స్థలాల్లో తప్పనిసరిగా మాస్కు ధరించాలి. అవసరం లేని ప్రయాణాలు, గుంపులలో కూడే కార్యకలాపాలకు దూరంగా ఉండాలి. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస సమస్య వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుని సలహా తీసుకోవాలి.
– డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌వో

నేడు యువత పోరు



- నిరుద్యోగుల పక్షాన వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాట

విజయనగరం: ఎన్నికలకు ముందు అధికారమే పరమావధిగా హామీలు గుప్పించి నేడు ఏడాది పాలన ముగుసినా.. కూటమి సర్కార్ నిరుద్యోగ యువత, విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం యువత పోరుకు సిద్ధమైంది. పార్టీ యువజన విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎన్నికలకు ముందు కూటమి పార్టీలకు చెందిన నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ యువతకు రూ.3000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నమ్మించారు. యువత కూటమి నేతల మాటలు నమ్మింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక యువతను మోసపుచ్చింది. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి చెల్లించలేదు. 20 లక్షల ఉద్యోగాల మాట అటుంచితే ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తోంది. దీంతో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం యువత పక్షాన నిలబడి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు సిద్ధమైంది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కరుమజ్జి సాయికుమార్ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ మాజీ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి నివాసం నుంచి బయలుదేరి గంటస్తంభం, కన్యకాపరమేశ్వర టెంపుల్, సీఎంఆర్ జంక్షన్, గూడ్స్ షెడ్ జంక్షన్, షాలిమార్ హోటల్, జ్యోతిరావు పూలే విగ్రహం వద్దకు చేరుకొని, అక్కడ నుంచి జిల్లా నలుమూలల నుంచి వచ్చినటువంటి యువతతో కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నిరుద్యోగ యువతకు న్యాయం చేకూర్చాలని వినతిపత్రం అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సాగునీటి చెరువునూ చెరపడుతున్నారు...



రాజాం మండలం వీఆర్ అగ్రహారం సమీపంలోని సాగునీటి చెరువునూ అధికార పార్టీ నేతలు చెరపడుతున్నారు. యథేచ్ఛగా చెరువు నుంచి గ్రావెల్‌ను తవ్వుతూ అక్రమ రవాణా చేస్తున్నారు. గుయ్యానవలస గ్రామానికి చెందిన టీడీపీ నేత ఒకరు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. చెరువులో పొక్లెయిన్లు పెట్టి పెద్ద పెద్ద గుంతలు తవ్వి గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. దీని వల్ల సాగు భూములకు, మూగజీవాలకు తీరని నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. తవ్వకాలపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వీఆర్ అగ్రహారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.
– రాజాం

నిట్టూర్పుల మధ్య ఎంటీఎస్ టీచర్ల బదిలీలు

- 475 మంది ఎంటీఎస్‌లకు స్థాన చలనం



ఎంటీఎస్ బదిలీల కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: తక్కువ వేతనంతో పని చేస్తున్న మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్ల బదిలీలు పలువురి నిట్టూర్పుల మధ్య జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందింరలో ఆదివారం నిర్వహించిన ఎంటీఎస్ బదిలీల్లో పలువురికి దూరప్రాంతాల పాఠశాలకు కేటాయించడం వల్ల వారు ఆవేదనకు గురవడం కనిపించింది. వీరిలో చాలా మంది రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నారని వారిని నివాస ప్రాంతానికి దూరంగా పంపడం దారణమని రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు చేస్తూ వ్యతిరేకిస్తున్నారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మినిమం టైం స్కేల్‌పై 2021లో 2008 డీఎస్సీ అభ్యర్థులకు, 2023లో 1998 డీఎస్సీ అభ్యర్థులు పోస్టింగ్ ఇవ్వడంతో పాటు వారు నివాసముంటున్న ప్రాంతాలకు దగ్గరలోనే స్కూళ్లలోనే నియమించింది. వీరిలో గత రెండేళ్లలో కొందరు రిటైరైన వారున్నారు. ప్రస్తుతం జిల్లాలో వీరు 475 మంది సర్వీసులో ఉన్నారు. ఈసారి ఎంటీఎస్‌ల బదిలీల్లో స్థానిక ప్రాంతాల్లో పోస్టింగ్ అన్న అంశాన్ని తొలగించి పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను అమలు చేసింది. దీని వల్ల రెగ్యులర్ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఖాళీగా ఉన్న కేటగిరి–4లోని మారుమూల గ్రామీణ పాఠశాలను మాత్రమే వారికి కేటాయించారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వీరికి గత ప్రభుత్వం స్థానికంగా ఉండేలా అవకాశం కల్పిస్తే కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా అమలు చేసింది. వీరిలో అనారోగ్యం, రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవారే అత్యధికంగా ఉన్నారు.

475 మంది ఎంటీఎస్‌లకు స్థాన చలనం

స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంటీఎస్ టీచర్ల బదిలీ ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి జిల్లాలో 475 మంది ఉన్నారు. ప్రస్తుతం 21 ఖాళీలు మాత్రమే ఉండగా వీటితో పాటు 390 వరకు క్లస్టర్ ఏర్పాటు వల్ల పోస్టులు లభించాయి. పాఠశాల కేటగిరి –3, 4లో మరో 65 పోస్టులున్నాయి. కౌన్సెలింగ్ ద్వారా వాటిని కేటాయించామని డీఈవో యు.మాణిక్యంనాయుడు తెలిపారు.

రేగులగూడ జీడితోటల్లో ఏనుగులు



జీడి తోటలో ఉన్న ఏనుగులు

సీతంపేట: ఏజెన్సీలో రేగులగూడ సమీపంలో ఉన్న జీడి తోటల్లో ఏనుగులు తిష్టవేశాయి. జీడి మొక్కలను నాశనం చేయడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కొండపైకి ఎక్కినట్టే ఎక్కి మళ్లీ ఆదివారం సాయంత్రం కొండ దిగువన ఉన్న జీడితోటలో దర్శనమివ్వడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన గిరిజనులు పరుగులు తీశారు. ఏనుగుల ఘీంకారాలతో భయాందోళనలు చెందుతున్నట్టు పలువురు గిరిజన రైతులు తెలిపారు. ఏనుగులు సంచరించే వైపు ప్రజలు వెళ్లొద్దని, కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని ఎఫ్‌బీవో కె.దాలినాయుడుతో పాటు ట్రాకర్లు సూచనలిస్తున్నారు.

గిరిజన మహిళ కన్నీటి వేదన!



ఇద్దరు చిన్నారులతో కొండగొర్రి సంధ్య

పార్వతీపురం రూరల్: ఆమె ఓ గిరిజన మహిళ.. 19 ఏళ్లకే వివాహం జరిగింది. ఏడాది కిందట భర్త విష జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. భర్త మృతి చెందే నాటికి సంధ్య మొదటి బిడ్డకు ఏడాది వయసు. అప్పటికే మళ్లీ గర్భిణి కావడంతో తరువాత ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం ఆడ బిడ్డకు నెలల వయసు. అప్పటి నుంచి ఆధారం లేక బిడ్డలతో అవస్థలు పడుతూనే ఉంది. ఆమె కష్టాలు చూసి ఇటు పాలకులకుగాని, అటు అధికారులకుగాని మనసు కరగ లేదు. పింఛన్ మంజూరు కాలేదు. రేషన్ ఇవ్వడం లేదు... ఇది ఓ గిరిజన మహిళ కన్నీటి వేదన. వివరాల్లోకి వెళ్తే..

పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ కొత్తపాకలు గ్రామంలో ఉంటున్న కొండగొర్రి సంధ్య భర్త రమేష్‌తో పాటు ఒక బిడ్డతో ఉన్నంతలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. భర్త రమేష్ ఏడాది కిందట విష జ్వరంతో మృతి చెందాడు. అప్పటికే ఒక చిన్నారితో పాటు నెలల గర్భవతిగా ఉన్న సంధ్య ఒంటరిగా తన జీవితాన్ని అతి కష్టంతో నెట్టుకొస్తోంది. అంతలోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే భర్త మరణాంతరం తనకు వితంతు పింఛన్‌తో పాటు రేషన్ కార్డు మంజూరు చేయాలని సంబంధిత పంచాయతీ అధికారుల వద్ద మొర పెట్టుకుంది. అధికారుల చుట్టూ తన ఓపిక ఉన్నంత మేరకు తిరిగింది. అయినా వారి మనసు చలించలేదు. ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో తన ఆవేదనను ప్రజా సంఘాల నాయకుల వద్ద చెప్పుకుంది. సంధ్య బాధను విన్న సీపీఎం నాయకులు కలెక్టర్ దృష్టిలో సోమవారం పెడతామని పింఛన్, రేషన్ కార్డు మంజూరుకు తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

రగులుతున్న జిందాల్

- భూముల్లోకి తరలివచ్చిన నిర్వాసితులు
- అడ్డుకున్న పోలీసులు
- రోడ్డుపై బైఠాయించిన నిర్వాసితులు
- పోరాటానికి సిద్ధమంటున్న సీపీఎం, గిరిజన, రైతు సంఘాలు
- మద్దతు పలికిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



జిందాల్ భూములు వద్దకు ర్యాలీగా వస్తున్న నిర్వాసిత రైతులు



జిందాల్ భూములు వద్ద పోలీసు బందోబస్తు

శృంగవరపుకోట:

తామిచ్చిన భూముల్లో జరుగుతున్న పనులను చూసేందుకు వచ్చే తమను అడ్డుకోవడమేంటని ఆగ్రహించిన జిందాల్ నిర్వాసితులు రహదారిపై బైఠాయించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. జిందాల్ నిర్వాసితులు సీపీఎం, ఆదివాసీ సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో తమ భూముల్లో జరుగుతున్న భూముల్లో పనులు చూసేందుకు బొడ్డవర నుంచి ర్యాలీగా ఆదివారం బయలుదేరారు. ముందే సమాచారం అందుకున్న పోలీసులు వీరి ర్యాలీని ఐతన్నపాలెం వద్ద అడ్డుకున్నారు. ఒక సమయంలో పోలీసులను దాటి వెళ్లేందుకు నిర్వాసితులు ప్రయత్నించారు. అయినా రోప్ పార్టీతో పోలీసులు అడ్డుకట్ట వేశారు. దీంతో ఆగ్రహించిన నిర్వాసితులు విజయనగరం బొడ్డవర నేషనల్ హైవేపై బైఠాయించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అలానే బైఠాయించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వీరికి అండగా ఎస్.కోట ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమారి, గ్రామపెద్దలు నిలిచారు. ఈ సందర్భంగా సీపీఎం, ఆదివాసీ సంఘం, రైతు సంఘం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, అప్పలరాజు, చల్లా జగన్ మాట్లాడుతూ పరిశ్రమ వస్తే బతుకులు బాగుపడతాయని రైతులు భూములిచ్చారన్నారు. 18 సంవత్సరాలు దాటినా ఎటువంటి పరిశ్రమ రాకపోగా భూములిచ్చిన రైతులు కూలీలుగా మారారని, వీరికి న్యాయం చేయాలని కోరారు. భూములిచ్చిన స్థలంలో పరిశ్రమ రాకుంటే చట్టపరంగా ఆరేళ్లలో తిరిగి రైతులకు ఆ భూములు ఇవ్వాలన్న నిబంధన ఉందన్నారు. మహిళలు మాట్లాడుతూ తమ భూములు పోయి ఇబ్బందులు పడుతుంటే పోలీసులు, ప్రభుత్వం జిందాల్ కంపెనీ పక్షాన ఎలా నిలబడతారని ప్రశ్నించారు. సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొద్ది రోజుల్లో పరిష్కరిస్తా : ఎమ్మెల్యే

జిందాల్ నిర్వాసితుల సమస్య పరిష్కరించేందుకు తనకు కొద్ది రోజులు సమయం కావాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. జిందాల్ నిర్వాసితుల ఆందోళన వద్దకు ఆమె వెళ్లారు. నిర్వాసితులతో మాట్లాడారు. సమస్యను కలెక్టర్ దృష్టిలో పెడతానని వెంటనే పరిశ్రమకు భూములిచ్చిన గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వం ఉపాధి కల్పనకు పెద్దపీట వేస్తుందని అందరూ సహకరిస్తే వేల మందికి జిందాల్‌తో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు.

మీ కోసం పోరాడుతా..: ఎమ్మెల్సీ

జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న నిర్వాసితులను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లానని, మరొకసారి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లానని చెప్పారు. జిందాల్ పరిశ్రమకు తాటిపూడి జలాలు ఇస్తే విశాఖ, విజయనగరం, ఎస్.కోట ప్రాంతాలకు సాగు, తాగునీరు సమస్య ఉత్పన్నమవుతుందన్నారు.



నిర్వాసిత రైతులను అడ్డుకున్న పోలీసులు

క్లుప్తంగా

పీఏఏపీ జిల్లా అధ్యక్షుడిగా 'వంగల'



వంగల దాలినాయుడు

పార్వతీపురం: ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పీఏఏపీ) పార్వతీపురం జిల్లా అధ్యక్షుడిగా వంగల దాలినాయుడు నియామకయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శిఖరం నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఈశ్వరయ్య ఆదివారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లాలో గల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వంగల దాలినాయుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని చెప్పారు. తనకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: ఈ నెల 23 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జరగనున్న జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు అర్హత సాధించారు. ఈ నెల 10, 11 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో బంగారు పతకం సాధించిన హర్షిణి, తరుణ్, రోహిణి సత్య, బి. హర్షవర్ధన్, వైష్ణవీదేవి, షణ్ముఖ సిద్ధార్థ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్ యశస్విని ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్



జీఆర్‌పీ సిబ్బంది అదుపులో సెల్‌ఫోన్ దొంగ

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒకరిని జీఆర్‌పీ సిబ్బంది ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఎస్సై బాలాజీరావు మాట్లాడుతూ.. వైజాగ్ జీఆర్‌పీ డీఎస్పీ రామచంద్రరావు ఆదేశాలతో సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇతడ్ని విచారించగా.. రెండు సెల్‌ఫోన్లు అపహరించినట్లుగా తేలిందన్నారు. నిందితుడ్ని బొబ్బిలి మండలం చల్లవలసకు చెందిన ప్రసాద్‌గా గుర్తించామన్నారు. ఇతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం విశాఖ రైల్వేకోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని మత్స్యవాని పాలెం అనధికారికంగా మద్యం కలిగి ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి దగ్గర నుంచి ఎనిమిది మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలించినా, అమ్మినా కేసులు తప్పవని సీఐ హెచ్చరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

ఎన్నాళ్లీ ఇబ్బందులు..!

- రేకుల షెడ్డులో విద్యార్థులకు తరగతులు
- మా ఊరి పాఠశాల గోడు వినరా అంటున్న కె. పెద్దవలస గిరిజనులు
- చిన్నారుల భవిత కోసం నడుం బిగించిన గ్రామస్తులు
- రేకుల షెడ్‌కు ఎదురుగా పూరిపాక నిర్మాణం



ఏడేళ్ల కిందట గ్రామస్తులు నిర్మించుకున్న రేకుల షెడ్

మక్కువ: వారంతా గిరిజనులు.. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు.. వారి జీవితాల వలే పిల్లల జీవితాలు కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పాఠశాల తీరు మారకపోవడంతో ఆవేదన చెందారు. గతంలో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో భవనాన్ని తొలగించారు. అప్పటి నుంచి గ్రామంలో పాఠశాలే లేదు. ఉపాధ్యాయులు కొన్నాళ్ల పాటు ఓ చెట్టు కింద పాఠాలు బోధించేవారు. పిల్లలు అవస్థలు చూసి తల్లిదండ్రులు, గ్రామస్తులు చలించిపోయారు. ఎంతోమంది అధికారులకు, పాలకులకు పాఠశాల దీన స్థితిని వివరించారు. అయినా సమస్యకు పరిష్కారం దొరకకపోవడంతో గ్రామస్తులంతా నడుం బిగించి, చందాలు పోగుచేసుకొని రేకులషెడ్‌ను నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆ రేకుల షెడ్‌కు ఎదురుగా పూరిపాక నిర్మిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం కె.పెద్దవలస పాఠశాల దుస్థితిపై కథనం.

రేకుల షెడ్‌లోనే తరగతులు..

పాఠశాలలో 52 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి ఐదు వరకు చదువుతున్నారు. పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్‌లోనే తరగతులు చెబుతున్నారు. అయితే వర్షం కురిస్తే విద్యార్థులు, ఉపాధ్యాయులు తడిసిపోతున్నారు. పాఠశాలలో గతేడాది ముగ్గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహించేవారు. ఈ ఏడాది పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా ప్రభుత్వం గుర్తించడంతో, మరో లాంగ్వేజ్ పండిట్ పోస్టును మంజూరు చేశారు. దీంతో పాఠశాలలో 52 మంది విద్యార్థులతో పాటు నలుగురు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి దాపురించింది.



పూరిపాక వేసేందుకు కర్రలు సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

పూరిపాక నిర్మాణం..

గ్రామస్తులు గతంలో నిర్మించిన రేకుల షెడ్ విద్యార్థులకు సరిపోవడం లేదు. దీంతో పూరిపాక నిర్మాణం చేయాలని నిర్ణయించుకుని, ఆదివారం సమీపంలో ఉన్న కొండకు వెళ్లి వెదురుకర్రలు, మానికర్రలు తీసుకొచ్చి పూరిపాక నిర్మాణానికి నడుం బిగించారు. అలాగే గ్రామంలో గతంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని తొలగించారు. దీంతో ఓ అద్దె ఇంటిలో చిన్నారులకు విద్యాబుద్ధులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో అంగన్‌వాడీ భవనం కోసం పూరిపాకను నిర్మించేందుకు స్థలాన్ని గ్రామస్తులు కేటాయించుకున్నారు.



తమ చిన్నారులపై ఇంత చిన్నచూపు తగదంటున్న గ్రామస్తులు

నాడు - నేడు నిధులతో పునాదులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చొరవతో గ్రామంలో పాఠశాల భవనం నిర్మించేందుకు నాడు - నేడు ఫేజ్-2లో 38 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. సుమారు 10 లక్షల రూపాయలతో పునాదులు, పిల్లర్లు వేశారు. అలాగే స్పెషల్‌గ్రాంట్ నిధులు మరో 10 లక్షల రూపాయలను రాజన్నదొర మంజూరు చేయించినప్పటికీ, ఎన్నికల కోడ్ వల్ల నిధులు మంజూరుకు అంతరాయం ఏర్పడింది. దీంతో పనులు జరగలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పాఠశాలకు పక్కా భవనాలు నిర్మించాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.

గంజాయి రవాణా నియంత్రణకు చర్యలు

- ఎస్పీ వకుల్ జిందల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని నియంత్రించేందుకు బహుముఖం వ్యూహం అమలు చేస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గంజాయి నియంత్రణకు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి వ్యాపారాలతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను సీజ్ చేస్తున్నామని.. అలాగే వారిపై హిస్టరీ షీట్లు ప్రారంభించి నిఘా పెడుతున్నట్లు చెప్పారు. అలాగే గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యపరుస్తూ బహుముఖ వ్యూహాలు అమలు చేస్తున్నామన్నారు. ప్రతిరోజూ 10 చోట్ల డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. గత ఏడాదిలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిని గుర్తించి వారిపై 88 కేసులు నమోదు చేసి.. 2,157 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమందు, అక్రమ రవాణకు వినియోగించిన 30 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 288 మంది నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి 346 కిలోల గంజాయి, అక్రమ రవాణకు వినియోగించిన 21 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 155 మంది నిందితులను అరెస్ట్ చేసి, రిమాండకు తరలించామని చెప్పారు.

మాజీ సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



చిన్న శిర్లాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు శోచనీయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిన్నశిర్లాంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల మన్ననలు పొందేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. బుచ్చయ్యచౌదరికి వయసు పెరుగుతున్నకొద్దీ బుద్ధి మందగిస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి నీ తల నరకవచ్చు కదా అని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను దూషిస్తే పదవులు వస్తాయని ఆశతో టీడీపీ నాయకులు ఇలా నీచంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోయినప్పటికీ అమలు చేశామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారని.. దీన్ని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు పనికిమాలిన మాటలు అంటున్నారన్నారు. బుచ్చయ్యచౌదరి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, మండల కన్వీనర్ వావిలపల్లి జగన్ మోహనరావు, యూత్ కన్వీనర్ మజ్జి శ్రీనివాసరావు, మీసాల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చింత చెట్టుకు నిప్పు..

వీరఘట్టం మండలంలోని తూడి గ్రామంలో నివాస గృహాల మధ్య ఉన్న ఓ చింత చెట్టుకు ఆదివారం నిప్పంటుకుని పెద్ద మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న పాలకొండ ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. చెట్టు సమీపంలో ఉన్న చెత్తను కొంతమంది తగులబెడుతుండగా.. చెట్టుకు నిప్పు అంటుకుందని గ్రామస్తులు తెలిపారు.

వీరఘట్టం



కబడ్డీ క్రీడాకారులకు ప్రోత్సాహం..

పాలకొండ: కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె. ప్రభావతి అన్నారు. పాలకొండలో అండర్ -18 కబడ్డీ జట్టు క్రీడాకారుల ఎంపిక ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కబడ్డీలో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య తక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిభ కలిగిన వారు మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వీరిని ప్రోత్సహించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు.

14 మంది క్రీడాకారులు ఎంపిక

ఈ నెల 27 నుంచి హరిద్వార్‌లో జరగనున్న అండర్ 18 కబడ్డీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశారు. 10 రోజులుగా పట్టణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు సహకారంతో క్రీడాకారులకు శిక్షణ అందించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 20 మంది క్రీడాకారులు శిక్షణ పొందారు. వీరిలో 14 మందిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఇందుకోసం ప్రభావతితో పాటు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై. శ్రీకాంత్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎన్. అప్పారావు క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జట్టును ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ నాయకులు సబ్బరాజు, నాంచారయ్య, రాంబాబు, సుధాకర్ మాట్లాడుతూ.. కబడ్డీ క్రీడాకారులకు పలు సూచనలు అందించారు. పది రోజుల పాటు ఉచిత భోజనం, వసతి కల్పించిన పల్లా కొండలరావుకు అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా అసోయేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అసోషియేషన్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఎల్ నాయుడు, వి. చంద్రశేఖర్, గార లక్ష్మణ్, కె. రమేష్, పలువురు మాజీ క్రీడాకారులు పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో రాష్ట్ర అసోసియేషన్ నాయకులు



ప్రభావతిని సన్మానిస్తున్న జిల్లా అసోషియేషన్ నాయకులు, క్రీడాకారులు

బుచ్చి అప్పారావు జలాశయాన్ని.. ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాల్సిందే..!

- జిందాల్ పరిశ్రమకు నీటి తరలింపును సంఘటితంగా అడ్డుకోవాలి
- బుచ్చి అప్పారావు జలాశయం ఆయుకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జోగినాయుడు

గంట్యాడ: గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయాన్ని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాలని బుచ్చి అప్పారావు జలాశయం ఆయుకట్టు పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం (తాటిపూడి) వద్ద ఆదివారం సాయంత్రం ఆయుకట్టు పరిరక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. జిందాల్ పరిశ్రమకు నీటి తరలింపును సంఘటితంగా ఎదుర్కోవాలని సభ్యులందరూ ముక్త కంఠంతో పిలుపునిచ్చారు. ఒక్క నీటిబొట్టు కూడా తరలించడానికి ఒప్పుకోకూడదని నిర్ణయించారు.

ఇరిగేషన్ ప్రాజెక్టుగా ప్రకటించాలి..

గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయాన్ని ఇరిగేషన్ ప్రాజెక్ట్‌గా ప్రకటించాలి. ఏ ప్రభుత్వం అయినా సాగునీటికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. తాటిపూడి జలాశయం కోసం గొర్రిపాటి బుచ్చి అప్పారావు పరితపించేవారు. గతంలో జలాశయం నుంచి 45 వేల ఎకరాలకు సాగు నీరు అందగా.. క్రమంగా 15,368 ఎకరాలకు తగ్గించేశారు. 30 వేల ఎకరాల రైతులు సాగునీటి హక్కు కోల్పోయారు. ఈ సమస్యను జిల్లాకు చెందిన మంత్రి, ఎస్. కోట ఎమ్మెల్యే, తదితరులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలి.

– అల్లుకేశవ వెంకట జోగినాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రైతు, ధర్మవరం

పరిశ్రమకు నీరిస్తే పంట చేతికి రాదు..



బుచ్చి అప్పారావు జలాశయం నీటిని పరిశ్రమకు తరలిస్తారని తెలిసింది. ఏమాత్రం నీటిని ఇచ్చినా పంట చేతికిరాదు. ఇప్పటికే పంటలకు ఆఖరి తడి కోసం అహోరాత్రులు కష్టపడాల్సిన పరిస్థితి. పరిశ్రమ ప్రతినిధులు బుచ్చి అప్పారావు జలాశయం నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకోవాలి. నీటి తరలింపునకు అంగీకరిస్తే పూర్వీకుల త్యాగాలకు అర్థం ఉండదు.

– గొర్లె రవికుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రైతు, జామి

నీటిని తరలిస్తే నష్టపోతాం..



జిందాల్ పరిశ్రమకు నీటిని తరలిస్తే తీవ్రంగా నష్టపోతాం. కంపెనీలకు నీరు తరలించకుండా అడ్డుకోవాలి. వ్యవసాయంపై ఆధారపడి ఎంతోమంది జీవిస్తున్నారు. ఇప్పటికే సాగునీరు సరిపోదు. ఇటువంటి పరిస్థితుల్లో నీటిని తరలిస్తే రైతాంగం పరిస్థితి ఏమిటి?. – బోశం ఏర్నాయుడు, రైతు , పెంట శ్రీరాంపురం గ్రామం

అడ్డుకోవాలి..



బుచ్చి అప్పారావు జలాశయం ఉందనే ఉద్దేశంతో జిందాల్ పరిశ్రమకు భూ సేకరణ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే, పైప్ లైనుల పనులకు సంబంధించి రైతులు వేలాది ఎకరాల భూమిని కోల్పోయారు. రాజకీయాలకు అతీతంగా పోరాటం చేసి నీటి తరలింపును అడ్డుకోవాలి.

– బుద్ధరాజు రాంబాబు, రైతు సంఘం కార్యదర్శి

రైతులు నష్టపోయారు..



జిందాల్ పరిశ్రమకు భూములిచ్చి రైతులు నష్టపోయారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి జిందాల్ యాజమాన్యం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తోంది. బుచ్చి అప్పారావు జలాశయం నుంచి ఎంఎస్‌ఎం పార్కు ఏర్పాటు చేసి నీటిని తరలిస్తే ఈ ప్రాంతం అంతా ఏడారవుతుంది. జలాశయం నీటిని పరిశ్రమలకు తరలించకుండా హైకోర్టులో పిల్ వేయనున్నాం. – ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్సీ

క్రైం కార్నర్

రామాలయంలో చోరీ



తాళాలు పగులగొట్టిన హుండీ

జామి: మండల కేంద్రంలోని చుక్కవారి వీధిలో గల రామాలయంలో ఆదివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. అర్చకుడు వి. సాయి ఎప్పటిమాదిరిగా పూజా కార్యక్రమాలు ముగించుకుని ఆలయానికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. మధ్యాహ్న సమయంలో ఆలయంలో ఎవ్వరూ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తలుపులు తొలగించి, హుండీ తాళాలను పగులగొట్టి నగదు అహహరించుకుపోయారు. హుండీలో సుమారు 15 వేల రూపాయల వరకు ఉండవచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



భాస్కరరావు (ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని కాశిందొరవలస పంచాయతీ మోసూరువలస గిరిజన గ్రామానికి చెందిన మోసూరు భాస్కరరావు (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. భాస్కరరావు రామభద్రపురం మండలం జోగిందొరవలస గ్రామ సమీపంలో పనులు ముగించుకుని శనివారం రాత్రి తిరిగి వస్తుండగా.. వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి స్థానిక సీహెచ్‌సీకి తరలించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి ఒక కుమారుడు ఉండగా.. భార్య ధనలక్ష్మి ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భిణి. కుమారుడి మృతితో తల్లిదండ్రులు గోపాలు, తవుడమ్మలు కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మిస్సింగ్



జేజమ్మ (ఫైల్)

దెంకాడ: మండలంలోని ఆకులపేట గ్రామానికి చెందిన నిడిగట్టు జేజమ్మ(65) కనిపించకపోవడంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19వ తేదీన తెల్లవారుజాము 4 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన జేజమ్మ తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు నీలిరంగు చీర, ఎరుపు రంగు జాకెట్ వేసుకుందని తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతో తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఎవరికైనా కనబడితే 91211 09446, 91548 74492 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.